ఇవన్నీ చెప్పాక ఈ ఆదేశాలన్నీ రెండు రాతి పలకలపై స్వయంగా తన చేత్తో రాసి దేవుడు మోజెస్‌కి యిచ్చి పంపించాడు. దేవుడితో మాట్లాడడానికి వెళ్లిన మోజెస్ సినాయి పర్వతం నుండి ఎంతకీ దిగిరాకపోవడంతో హీబ్రూలు ఆరాన్ వద్దకు వెళ్లి "మమ్మల్ని ఈజిప్టునుండి తీసుకుని వచ్చేసిన మోజెస్ ఏమై పోయాడో తెలియకుండా వుంది. దేవుడి సాయం లేనిదే మేమెలా బతుకుతాం? మాకు ఓ దేవుణ్ని సృష్టించి యియ్యి" అని అడిగారు. అతను వారి దగ్గరున్న బంగారమంతా సేకరించి, బంగారంతో ఓ ఎద్దు ప్రతిమ తయారుచేసి యిదే మన దేవుడు అన్నాడు. తమను ఈజిప్టునుండి క్షేమంగా తీసుకుని వచ్చిన దేవుడు యితడేనంటూ వారందరూ ఆ ప్రతిమకు బలులు సమర్పించారు. పండగ చేసుకున్నారు, ఆ పండగలో ఆడి, పాడి, విచ్చలవిడి శృంగారంలో పాల్గొన్నారు.

ఇదంతా తెలిసిన దేవుడికి కోపం వచ్చింది. మోజెస్‌తో "నువ్వు వెంటనే వెళ్లి యిదంతా ఆపించు. ఆ ప్రతిమదేవుణ్ని ఆరాధించిన వాళ్లందరినీ నేను నాశనం చేస్తాను" అన్నాడు. వాళ్లు అజ్ఞానులని, ప్రస్తుతానికి శాంతించి క్షమించమని దేవుణ్ని ప్రార్థించి మోజెస్ కొండ దిగి వచ్చాడు. జోషువా కనబడి యిలా పండగ చేసుకుంటున్నారని చెప్పాడు. వాళ్ల వరస చూడగానే మోజెస్‌కి కోపం వచ్చి దేవుడు యిచ్చిన పలకలు విరగకొట్టేసాడు. ఆ బంగారు ఎద్దు బొమ్మను కరిగించేసి పొడి పొడి చేసేసి నీట్లో కలిపి అందరి చేతా తాగించేశాడు. ఆరాన్‌ను కోప్పడ్డాడు. తర్వాత ఒక శిబిరాన్ని ఏర్పరచి మన దేవుడి పక్షం వహించేవారందరూ యిటు రండి అన్నాడు. మోజెస్ జాతి వారైన లేవీయులు మాత్రమే అతనితో వచ్చారు. "మీరందరు కత్తులు చేతపట్టి మీ సోదరులను, స్నేహితులను నరకండి" అన్నాడు. అప్పుడు వాళ్లు మూడువేల మంది యితర జాతి వారిని నరికేశారు. "మీరంతా దేవుడికి యిష్టమైన పని చేసి అతనికి పూజారులయ్యారు" అని మెచ్చుకున్నాడు మోజెస్.

మర్నాడు మోజెస్ కొండపైకి వెళ్లి "లేవీయులు బంగారుప్రతిమను పూజించి నీ ఆగ్రహానికి గురయినా వాళ్లు నిన్ను వ్యతిరేకించినవారిని నరికి పాపప్రక్షాళన చేసుకున్నారు. వారిని మన్నించు" అని కోరాడు. "నువ్వు యిప్పుడు నేను చెప్పిన చోటుకి యీ ప్రజలను తీసుకుని వెళ్లు. నా దూత మిమ్మల్ని నడిపిస్తాడు. అతని ద్వారా యిజ్రాయేల్లో నివసించి వున్న యితరులను అక్కడనుండి వెళ్లగొట్టిస్తాను. నేను మీతో రాను. ఎందుకంటే మీ అహంకారం చూసి కోపం వచ్చి శిక్షిస్తానేమో. ఇక క్షమాభిక్ష అంటావా, సమయం వచ్చినపుడు ప్రజల పాపపుణ్యాలు విచారించి తగినట్టు శిక్షిస్తాను." అన్నాడు దేవుడు.

మోజెస్ యివన్నీ ప్రజలకు చెప్పాడు. దేవుడికి కోపం వచ్చిందని తెలిసి వాళ్లు బాధపడి నగలు వేసుకోవడం మానేశారు. ఆ శిబిరంలో మోజెస్ ఓ ప్రత్యేకమైన గుడారం వేసి వుంచాడు. దేవుడితో మాట్లాడదామనుకున్నపుడల్లా దానిలోకి వెళ్లి మాట్లాడేవాడు. ఓ సారి మోజెస్ దేవుణ్ని తన తేజస్సు చూపమని అడిగాడు. "నా మొహం చూసిన వారెవరూ బతికి వుండలేరు. అందువలన నేను నీ దగ్గర్నుంచి వెళ్లేటప్పుడు నిన్ను కొండనెరియలో పెట్టి నా చేత్తో మూస్తాను. నా పేరు ఉచ్చరిస్తూ నేను వెళ్లిపోయాక, చేయి తీసేస్తాను. అప్పుడు నువ్వు నా వీపుమాత్రం చూడగలవు. మొదటివి విరగకొట్టేశావు కాబట్టి రేపు యింకో రెండు రాతిపలకలు తయారుచేసి పట్టుకుని నువ్వొక్కడివే రా." " అన్నాడు దేవుడు.

మర్నాడు మోజెస్ సినాయి పర్వతంపైకి వెళ్లి దేవుణ్ని కలిశాడు. "నేను నా ప్రజలపై తరచుగా ఆగ్రహించను. మంచివారిని తరతరాలుగా ఆదుకుంటాను. కానీ పాపం చేసిన వారిని విడిచిపెట్టను. తలిదండ్రులు చేసిన పాపాలకు పిల్లలను, మనుమలను కూడా శిక్షిస్తాను" అన్నాడు. తన ఆదేశాలను మళ్లీ వినిపించి మోజెస్‌చే రాతిపలకలపై రాయించాడు. మోజెస్ ఆ పర్వతంపై దేవుడితో బాటు నలభై రోజులు నిద్రాహారాలు లేకుండా వున్నాడు. అతను పర్వతం నుండి దిగి వచ్చేటప్పుడు అతని మొహం తేజస్సుతో వెలుగుతోంది. దానికి ప్రజలు భయపడుతున్నారని గమనించి అతను ముసుగుతో మొహం కప్పుకునేవాడు. ఆ తర్వాత అందర్నీ పిలిచి దేవుడు యిచ్చిన ఆదేశాలను వినిపించాడు.



తను దేవుడితో మాట్లాడే శిబిరాన్ని ఆలయంగా మార్చాడు. దానిలో భగవదారాధనకు కావలసినవన్నీ చేర్చి ఆరాన్ సంతతి వారిని పూజారులుగా వుంచి ఆ ఆలయంలో యీ రాతి పలకలను భద్రపరచాడు. హీబ్రూలు ఈజిప్టునుండి బయలుదేరిన రెండో సంవత్సరం మొదటి రోజున ఆలయం కట్టారు. హీబ్రూలు ఇజ్రాయేలు వైపు వెళుతూ ఎక్కడెక్కడైతే బిడారాలు వేశారో, అక్కడ యీ ఆలయాన్ని కూడా వెంట తీసుకుని వెళ్లేవారు. దేవుడు మేఘం రూపంలో ఆ ఆలయాన్ని ఆవహించేవాడు. పగలు ఆ మేఘం గుడారంమీద నిలిచేది. రాత్రి ఆ మేఘంనుండి నిప్పు వెలిగేది. మేఘం గుడారం నుండి పైకి లేచినప్పుడు యిక అక్కణ్నుంచి ముందుకు కదలాలని వారికి సంకేతం అన్నమాట. అలా వాళ్లు ఇజ్రాయేలు వైపు తమ ప్రయాణం సాగించారు. దీంతో రెండో అధ్యాయం "ఎక్సోడస్" ముగిసింది.

మూడో అధ్యాయమైన "లెవిటికస్" దేవుడికి పూజారులైన లేవీయులు ఏ విధమైన మతాచారాలు పాటించాలో వాటి గురించి చెప్తుంది. ఇవన్నీ ఆ మతస్తులకే తప్ప మనకు పనికి రావు. ఈ అధ్యాయం మనం వదిలేయవచ్చు. దీనిలో చెప్పిన ఒక సూక్తి (లేవి

19–18) జీసస్ క్రైస్తు నోట చాలా ప్రాముఖ్యత చెందింది. అది "నువ్వు నిన్ను ఎలా ప్రేమిస్తావో అలాగే పొరుగువాడిని కూడా ప్రేమించు".

ఇక నాలుగో అధ్యాయం – సంఖ్యలు. సరిగ్గా చెప్పాలంటే జనగణన. సినాయి పర్వతం  వదిలి ఇజ్రాయేలు తూర్పు హద్దు దాకా చేరడానికి హీబ్రూలకు నలభై ఏళ్లు పట్టింది. ఈ మధ్యలో వారి జనాభా పెరిగిందో, తరిగిందో చూడడానికి మోజెస్ సినాయి పర్వతం వద్ద ఒకసారి, మోవాబ్ వద్ద మరోసారి జనాభా లెక్కలు తీసుకున్నాడు. ఒక్కో జాతి వారు ఎంతెంత మంది వున్నారో లెక్కలు వేసి చూశాడు. అందువలన యీ అధ్యాయానికి ఆ పేరు వచ్చింది. ఈ అధ్యాయం సినాయి పర్వతం నుండి ఇజ్రాయేలు తూర్పు హద్దును చేరడానికి హీబ్రూలు పడిన కష్టాలు చెపుతుంది. కష్టాలు ఓర్వలేక మధ్యలో ఆగిపోయినవారు, ఉన్నదానితో తృప్తి పడే మధ్యములు, ఎంత శ్రమకైనా ఓర్చి అనుకున్న గమ్యాన్ని చేరడానికి ముందుకు సాగే ఉత్తములు – అందరూ కనబడతారు. వారందరి కథ వచ్చే గురువారం నుండి. (సశేషం) **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2011)**